


# మితభాషి

*బాబూశీలం

తాళం చెవి తో కూడా ... (margin)

క్ కుంజతో తాళం తీసాడు ప్రసన్న.

విసురుగా తోసిన తోపుకు తలుపు పోయి గోడకు కొట్టుకుంది. గోడసున్నం కాస్తగాలి క్రింద పడింది.

గడపదాటి లోపల అడుగు పెట్టాడు ప్రసన్న. మట్టికొట్టుకున్న అతని బూట్లకు ఏదో మెల్లగా తగిలింది. ముందుకు వంగి దాన్ని తీసాడు.

కవరు!!

పురందరదాసు స్మృతిచిహ్నంగా విడుదల చేసిన స్టాంపు కవరుమీద అతికించుంది. మధ్యాహ్నం మూడింటికి పోస్ట్‌మాన్ పారేసి పోయాడల్లే వుందనుకున్నాడు. దానిలోని వార్తలకంటే ముందు వేడికాఫీ త్రాగాలనుకున్నాడు. ఆఫీసు నుండి వచ్చిన అలసట కారణంగా.

హెడ్డాఫీసులో ఓ చిన్నకారకుమస్తాగిరి చేస్తున్నాడు—ప్రసన్న! ఈ మధ్యనే ఎపాయింట్ అయిన కారణంగా కాస్త క్రొత్తగానేవుంది ఆఫీసు లైఫ్—

అసలు కారణం—

ఒమ్మూరిడిసి!.... సొంతూరిడిసి!!.... సింగరేణికిరావడం !!

స్టౌ ఆన్‌చేసి గ్లాసెడ్నీళ్లెట్టాడు. స్టౌకు దగ్గరగా స్టూలేసు క్కూర్చున్నాడు.

పోస్టులో వచ్చిన కవరు చించి చదవడం మొదలు పెట్టాడు—

"చిరంజీవి ప్రసూకు తల్లి దీవించి వ్రాయుట. మేమంతా క్షేమము. నీక్షేమము తెలుపు. నీవు అక్కడ ఒంటరిగా ఎలా వుంటున్నావు. మరీ ఒంటరిగావుండకు. నలుగురితో కలసి మాట్లాడుతూవుండు. నీవు బిడియంగా తలవంచుకు పోయినా అది అందరూ బిడియంగా గ్రహించరు. అక్కడెవరో లోకనాధంగారి కుటుంబం, నీకిచ్చిన క్వార్టర్ కివతలగా వుంటున్నారని వ్రాశావు గదూ?.... వాళ్లకు ఇద్దరాడపిల్లలూ, ముగ్గురు మగపిల్లలూనా. సరే!.... మంచిది. నీవు కనీసం వాళ్ల మగ పిల్లలతో నన్నా మాట్లాడుతూ వుండు. ....."

ప్రసన్న నెవరో పట్టి పిండినట్లయింది— పదంతస్థుల భవంతిపైనుండి ఎవరో క్రిందికి గుంజినట్లయింది—తనున్న క్వార్టర్ కప్పుతో సహా పాతాళానికి పోతున్నట్లయింది.

తల్లి వ్రాసిన మాటలు బాకుల్లా గుచ్చుకున్నయి ప్రసన్న హృదయానికి. 'కనీసం వాళ్ల మగ పిల్లలతో నన్నా మాట్లాడుతూ వుండు.....' అవేమాటలు మరోసారి చాటాయి అతని మదిలో పాతుకు పోయిన పిరికితనాన్ని.

చీకటి రాత్రిలో రేడియంలా అగుపిస్తున్నయి— కాదు, వెక్కిరిస్తున్నయి అవేమాటలు. 'పోస్టుమాన్ పుణ్యమాలని ఇది నాచేతికే చిక్కింది. ఇదే గనుక ఇతరులు చదివుంటే?....' ఇంక ఆలోచించలేక పోయాడు ప్రసన్న. బెదురు బెదురుగా బయటకు చూశాడు. బడినుంచి అలసిన ముఖాలతో ఇళ్లకు పోతున్న ఆడపిల్లలు ప్రసన్న క్వార్టర్ కేసి చూస్తూ పోతున్నారు. 'ఆడాళ్లు సిగ్గుపడే రోజులు పోయాయి!' అనుకున్నాడు ప్రసన్న!

*　　*　　*

చిన్న నాటి నుండి మితభాషిగా వున్న ప్రసన్న నిజం చెప్పాలంటే పెరిగినకొద్దీ పిరికివాడయి పోయాడు. ఆ పిరికితనం ఎలాంటిదీ అంటే.... తారస పడినవాళ్లను తలెత్తి చూళ్లేడు. ఖర్మవశాన తలెత్తినా తప్పుకు పోతాడు. అంటే!.... కేవలం

ఆడాళ్ళు తారసపడితేనే తలెత్తక పోవడం కాదు. మగాళ్లయినా అంతే?....

కొందరు కుర్రాళ్లకు ప్రసన్నను పలుకరించడం హాబీగా వుండేది చదువుకునే రోజుల్లో. పోతున్న ప్రసన్నను పనిగట్టుకొని ఆపి పలుకరించేవారు, "ప్రసన్నా!.... విశాఖపట్నం తెలుసా నీకు?" అని. తెలుసన్నట్టు తలవూపే వాడు ప్రసన్న అమాయకంగా.

"ఆ వూళ్లో వో ముఖ్యమయిన ఆస్పత్రి వుంది చూశావా?" అంటూ అడిగే వాడొకడు.

"చూసుండడులే. చూస్తే ఎంచక్కా అక్కడనే ట్రీట్‌మెంట్ తీసుకొనేవాడు.." అనే వాడు వేరొకడు.

"మెంటల్ ఎఫెక్టే నంటావా ?" మరొకడు ఇంచక్కా శృతి కలిపేవాడు.

"మరి కాకుంటే?" ఫొల్లున నవ్వుతూ పొయ్యేవాళ్లు కుర్రాళ్లంతా.

ఇక ఇంటికివస్తే సరేసరి—

పెట్టి పిలిస్తే సరి. లేకుంటే అమ్మ నయినా సరే ఆకలని అన్నం అడిగేవాడు కాదు. ప్రసన్నకన్నం వడ్డించి ఎదురుగా కూర్చునేది వాళ్లమ్మ—తాయారమ్మ! .... "అదేవిటిరా? అంత తడీపొడిగా తింటావు. వంకాయకూర నీకిష్టమేగా వత్తుగా కలుపుకో!..... ఆపచ్చడిలో ఇంత నేతి చుక్క వేయనీ!.... మరీ ఇంత మలివరు పేవిటి. మజ్జిగన్నం తినకుండా చేయి కడుక్కు చక్కాపోతావు. సరే!....గ్లాసులో పోసిస్తా కాస్తాగు" అలా అతని ప్రతి కదలికా గమనిస్తుండేది.

ఏదేనారోజు పనిమీదవుండి 'అన్న కన్నం పెట్టమ్మా' అని కూతురు కమలకు పురమాయించిందంటే, నవలాలోకంలో వున్న కమల చదివిన మట్టుకు చాలిస్తానికి మనసొప్పక చదువుతూనే వంట గదిలో కొచ్చేది, "రాధ కృష్ణుడిలోభాగం, కృష్ణుడు రాధలో రూపం, అబ్బ! ఏం రాసిందిరా, లత! అ .... ఏది, ఆకంచమిలా అందుకో— అన్నం వడ్డిస్తా"

'ఇదోపుస్తకాల పురుగు!' షెల్ఫ్‌లో వున్న కంచం తెచ్చి చెల్లెలి కిచ్చేవాడు ప్రసన్న, చేసేదిలేక.

అన్నం వడ్డించేసి "మళ్లీ కోపా ఏమంటుకుంటావులే గాని, కంచంలోనే వేసేస్తున్నాను కూరగూడా!" జవాబుకన్నా ఎదురు చూడకుండా ఆ కూర కాస్తా కంచంలోనే వడ్డించి, "గ్లాసెక్కడెట్టు క్కొర్చో, గొంతు పట్టేను. మారన్నానికి అమ్మని పిలువు" అంటూ లతలో లీనమయి పోయేది కమల.

కంచం దగ్గరకు తీసుకొని, నాలుగు మెతుకులు కతికి, లేచక్కా పోయేవాడు ప్రసన్న!

తాయారమ్మ వచ్చి కంచంలో కూడు కంచంలోనే వుండటం, ప్రసన్న చేయి కడుక్కు చక్కాపోవడం చూసి విస్తుపోయేది.

'పిచ్చి ప్రసు!' అనుకుంటూ కమల దగ్గర కెళ్లి, "ఏమే కమల! ఎప్పుడూ పుస్తకాల లోకమేనా. వాడిక్కాస్త అన్నం పెట్టమంటే ఏవిటే పెడసరం?" కమల చేతిలో పుస్తకంలాగి ప్రక్కకు విసిరేది తాయారమ్మ.

కమ్మని కల చెదరి పోయినట్టు ఉలిక్కి పడి లేచేది కమల. ప్రక్కకు విసరిన పుస్తకాన్ని తీసి పైటకొంగుతో దులుపుతూ, 'అన్న కన్నం వడ్డించే వచ్చాను. నీలా వాడు తినేదాకా ఎదురుగ్గా కూర్చోవాలేం?.... అలా నాతరం కాదు—పార్వతి లాంటి పిల్లనొకదాన్ని చూసి మూడు ముళ్లేయించు. ఈయన గారి కెదురుగ్గా, ఆవిడగారే కూర్చుంటుంది ఏప్రొద్దూ కోడలొస్తే నీక్కాస్త శ్రమా తగ్గుతుంది,' మళ్లీ పుస్తకంలో పడేది కమల.

"ఆ పుస్తకాలు అఘోరించ బట్టే ఇన్నిన్ని మాటలు. అసలు వాడిక్కాదే! ఆమూడు ముళ్లూ ముందు నీకేయించాలి."

'పార్వ' తన్న పదం వినగానే తాయారమ్మ మదిలో ఒక్కసారి మెరుపు మెరిసినట్టు మెరిసేది— పార్వతి! తాయారమ్మ అన్న శంకరం గారి కూతురు పార్వతి— చిన్ననాటి నుండి ప్రసన్నకు పార్వతినిచ్చి చెయ్యాలని తాయారమ్మ తహ తహలాడేది— పార్వతంటే పడి చచ్చేది. పుత్తడి బొమ్మలా వుండే పార్వతిని 'ఏమే పారూ బావను చేసుకుంటావా?' అంటే 'పో అత్తయ్యా!' అంటూ సిగ్గుతో ప్రక్క గదిలోకి పారిపోయేది. సిగ్గుపడ్డ పార్వతి ముఖం 'ప్రసూ బావనిడిసి పరాయోణ్ణి చేపడతానా' అన్నట్టుండేది తాయారమ్మకు.

ప్రసన్న, పార్వతి చేయి చేయి పట్టి ఇల్లంతా తిరుగుతుంటే మురిసిపోయేది—తాయారమ్మ! ముచ్చటే పడి వో రోజున ఫోటో కూడా తీయించింది— వాళ్లిద్దరినీ కలిపి. చిరునవ్వు లొలక బోస్తున్న పార్వతీ ప్రసన్నలను చూసి "పార్వతీ పరమేశ్వరుల్లా వున్నార్రా!" అనేది అన్న శంకరం గారితో. "కాదని ఎవరన్నారే?" అనేవారు శంకరం గారు నవ్వుతూ.

ప్రమోషన్‌తో బాటు శంకరంగారికి హైదరాబాదు బదిలీ అయ్యేసరికి, కలిసి వున్న కుటుంబాలు విడిపోతున్నట్టే బాధ పడ్డారు తాయారమ్మగారు. పార్వతి తల్లి నాగమ్మగారిని కూడా ప్రమోషన్ వచ్చిందన్న సంతోషం వోప్రక్క, బదిలీ అయిందన్న బాధ మరో ప్రక్క కలచివేశాయి.

శంకరం గారిని బండి ఎక్కించడానికి స్టేషన్ వరకూ వచ్చారు ప్రసన్న, తాయారమ్మ.

నేరుగా హైదరాబాదు పోయే కంపార్టుమెంట్‌లో ఎక్కి కూర్చున్నారు శంకరం గారు, నాగమ్మ, పార్వతి. కిటికీకి దగ్గరగా ప్లాట్‌ఫామ్ మీద నిలుచున్నారు తాయారమ్మ, ప్రసన్న.

"పోంగానే వో వుత్తరం వ్రాయండి! క్రొత్త ప్రదేశం— అమ్మాయి జాగ్రత్త!!" కళ్లల్లో నీళ్లు పైటకొంగుతో ఒత్తుకొంటూ, "పారూ! అత్తయ్య కొక ముద్దివ్వవూ?" కిటికీ లోపలకు చేతులు జాచి అంతలోకే వెనక్కు తీసుకుంది గార్డ్ విజిల్ శబ్దం విని, తాయారమ్మ.

రైలు కదిలింది—

కదులుతున్న రైలు కిటికీలోనుండి చేయూపింది— పార్వతి!.... అప్రయత్నంగా చేయూపాడు-- ప్రసన్న!.....

తూలి పడబోయిన తాయారమ్మ ప్రసన్నను ఆసరాగాచేసుకు తేరుకుంది.

రైలు స్టేషన్ దాటింది—పార్వతితో పాటు తాయారమ్మ సర్వస్వాన్నీ తీసుకు పోయింది— రైలు! పలుచబడి పోయింది ప్లాట్‌ఫామ్!!

"అమ్మా! ఇక ఇంటికి పోదాం" ప్రసన్న తల్లిముఖంకేసి చూస్తేక పోయాడు.

బిక్కు బిక్కు మంటున్న బంధరు స్టేషన్ విడిచి భాస్కరపురంలో ఇంటికి చేరారు వాళ్లిరువురూ రిక్షామీద.

కళ కళ లాడుతూండే ఆ ఇంట్లో కారుచీకట్లలముకున్నయి. ప్రతి వస్తువు పార్వతినే జ్ఞప్తికి తెస్తుంది. తోడు లేని పక్షిలా ఒంటరివాడయి పోయాడు

ప్రసన్న. "ఈ వేళప్పుడు అక్కడ పార్వతి ఏం చేస్తుందంటావు?" తాయారమ్మ గారు అడిగేది పచ్చడి అన్నంలో నేతిచుక్క వేస్తూ ప్రసన్నను. ప్రసన్న కెందుకో సిగ్గనిపించేది. తాయారమ్మ కేసి వోసారి చూసి తలదించుకునే వాడు.

"ప్రతిరాత్రి పార్వతి కలలో కనిపిస్తుందిరా! ఎలావుందో ఏమో? వాళ్లు వెళ్లింది లగాయితు ఉత్తరాలన్నా వ్రాయడం లేదేవిటి?" మారన్నం వడ్డించి మళ్లీ అనేది తాయారమ్మ. "రేపు వో కవరు మీద మామయ్య వాళ్ల అడ్రస్ వ్రాసివ్వు. వాళ్లకు తీరిక లేకుంటే పార్వతితో నన్నా వో వుత్తరము వ్రాయించమని వ్రాస్తాను."

"అలాగే నమ్మా!" అనేవాడు ప్రసన్న మజ్జిగ అన్నం కలుపుతూ.

* * *

దినం మీద దినం దూకుడుగా దొర్లుకు పోతున్నాయి! కాలండర్లలో కాగితాలతో పాటు కాలండర్లే మారి పోతున్నాయి!! చిన్నవాళ్లు పెద్దవాళ్లవు తున్నారు— పెద్దవాళ్లు మరీ పెద్దవాళ్లవు తున్నారు— మరీ పెద్దవాళ్లు మరో లోకానికి పోతున్నారు!!! హృదయం చుట్టూ స్పాట్ లైట్స్ వేసిచూసినా అణువంతయినా అనురాగం అగుపించని హృదయాలే అందలమెక్కి కూర్చుంటున్నాయి.

వృత్తుల్లో హోదాలు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల్లో భావాలు మారుతూ వుంటాయి. ఆ భావాల కనుగుణంగా మసలు కుంటాడు మానవుడు. అలాంటి సమయంలోనే కొందరు అప్తుల్ని సైతం ఆదరించలేక పోతారు. ఆదరించిన వారిని విస్మరిస్తుంటారు. మాయలు—మంత్రాలు—మోసాలు — మరెన్నో కుతంత్రాల కాలవాలం, ఆ హోదా!

శంకరంగారికి, తాయారమ్మకు ఎలాంటి రాక పోకలు గాని, ఉత్తర ప్రత్యుత్తరాలు గాని లేవు. అన్నింటికీ అనకట్ట కట్టింది శంకరంగారి— హోదా!

ఎన్ని వుత్తరాలు వ్రాసినా శంకరం గారి దగ్గర నుండి జవాబురాకుండే సరికి విసుగుపుట్టి వుత్తరాలు వ్రాయటం చాలించింది. ఇక అన్న శంకరం గారు తాయారమ్మ స్మృతిపథం నుండి తొలగి పోయారనే చెప్పొచ్చు.

గతంలో తగిలిన గాయం మాసి పోయి చర్మంతో కలిసి పోతుంది.

## వితప్రాషి

కమల మెట్రిక్ పూర్తిచేసి షార్ట్ స్కూల్లో సెకండరీ ట్రెయినింగ్ చదువుతుంది. ఇక ప్రసన్న కాలేజీ చదువు ముగించబోతున్నాడు.

"అమ్మా !" కాలేజీనుండి పరుగు పరుగున వచ్చాడు ప్రసన్న: "రేపు మామయ్య మన వూరు వస్తున్నారమ్మా. ఇదిగో చూడు!" ఏదో కాగితం చూపించాడు తాయారమ్మకు.

"ఎవరు? .... శంకరం మామయ్యే, నిజంగా? ఏది, మనకే రాశాడా?" నమ్మనట్టు ప్రశ్నించింది తాయారమ్మ కొడుకు చేతిలో కాగితాన్నందుకొంటూ.

ప్రసన్న ముఖం ప్రక్కకు త్రిప్పు కున్నాడు, "మనకెందుకు వ్రాస్తారమ్మా. రేపు జిల్లా పరిషత్ ఆడిటోరియంలో మీటింగుందట, దానిలో మామయ్య ప్రసంగిస్తారట. కాలేజిలో వో కుర్రాడి దగ్గర ఈ ఆహ్వాన పత్రికవుంటే నీకు చూపుదామని తెచ్చాను" అన్నాడు బాధగా.

"అంటే!..... పార్వతీ, నాగమ్మ కూడా వస్తున్నారా ?" ఆత్రతగా అడిగింది తాయారమ్మ. 'ఇప్పుడెంత పెద్దదయి పోయిందో పార్వతి.'

"ఏమో?" ప్రక్క గదిలోకి పోతూ అన్నాడు ప్రసన్న "రేపు టి. బి. కెళ్లి కనుక్కుంటేగాని తెలీదు."

ఆరాత్రి తాయారమ్మకు కంటిమీద కునుకేలేదు. శంకరంగారు, నాగమ్మ, మళ్లీ చేరువవుతున్నట్టే సంబరపడి పోయింది. పార్వతే కళ్లల్లో మెదిలింది.

పార్వతీ, ప్రసన్నా కలిసి దిగిన చిన్నప్పటి ఫోటోతీసి లాంతరు వెలుతురులో చూసింది. కల్లాకపటం ఎరుగని పార్వతి కళ్లల్లోకి చూస్తుంటే ఆమె కళ్లు చెమర్చాయి. చెమర్చిన ఆమె కళ్లు వో కన్నీటి చుక్కను ఆ ఫోటోపై రాల్చాయి. లాంతరు వెలుతురులో తళుక్కుమంది ఆ కన్నీటి చుక్క! ఆమె కన్నీటిని చూసి ఆమే త్రొటుపడింది— త్రొటుపడ్డ తాయారమ్మ మదిలో కలవరం మొదలయింది.

తన అంతర్వాణి అంటుంది, "ఇప్పుడు నీ అన్న వో వున్నతాధికారి. అందలమెక్కిన నీ అన్న నీకందుతాడను కున్నావా?..... పార్వతిని నీ ప్రసన్నకిచ్చి కట్టబెడతాడను కున్నావా?..... పేరాశకు పోకు పిచ్చిదానా!" తన నీడ తనకే నాగుపాములా అగుపడింది, "నా అన్న కూతుర్ని నాకొడుక్కిమ్మనడం పేరాశా?" తనలో తనే గొణుక్కుంది.

కలక్టరేట్ లో నాలుగ్గంటలు కొట్టారు!.. గొంతంతా చించుకుంటూ అరుస్తుంది రైలుకట్ట కవతలగా వో నక్క. గొంతెత్తి కూయబోయిన కోడిపుంజు కిమ్మనకుండా నక్కింది—ఆనక్క అరుపుకు. షార్ట్ స్కూల్ హాస్టల్ పిల్లల్ని లెగ్గొట్టేస్తుంది మేట్రిన్ నమ్మ గంటలు మ్రోగిస్తూ.

తాయారమ్మ లేచి మధ్య గదిలోకొచ్చేసరికి, ప్రసన్న పుస్తకం పుచ్చుకు కూర్చుండటం చూసి, కమలను కూడా లేపి తను పొయ్యి రాజ బెట్టడానికి వంట గదిలోకి పోయింది.

ఆరోజు ఉదయం టి. బి. కెళ్లికనుక్కున్నాడు ప్రసన్న— శంకరం గారి విషయం. శంకరంగారు కుటుంబంతో సహా వచ్చినట్టు, తెల్లారగట్టే సముద్ర స్నానానికి వెళ్లినట్టూ తెలిసింది అక్కడి పని వాడి ద్వారా. ఆరోజు కాలేజీకెగనామం పెట్టి జిల్లాపరిషత్ ఆడిటోరియం వద్దకెళ్లాడు ప్రసన్న.

అధునాతనంగావున్న ఆడిటోరియం, పగలే వెన్నెలలా ఆయిల్ పెయింట్స్ లో ముచ్చటగా వుంది— మెర్క్యురీ దీపాలతో మెరిసి పోతుంది. శబ్దం చేయకుండా తమపని తాము నిర్వహిస్తున్నాయి పకడ్బందీగా— పంకాలన్నీ. కుషన్ కుర్చీల్లో కూర్చుంటున్నారు ఆహ్వాన పత్రిక లందు కున్న ఆఫీసర్లంతా.

ఆహ్వాన పత్రికల్లేని వాళ్ళు కిటికీల కివతలగా నిలుచున్నారు. వాళ్లల్లో కలిసి పోయాడు ప్రసన్న.

స్టేజీమీదికి వచ్చాడు సభాధ్యక్షుడు! పూల మాలలతో ముంచెత్తారు పుర ప్రముఖులు!!

చప్పట్లు చరిచారు అంతా—

"ఇప్పుడు సభాధ్యక్షుడు శంకరంగారు మాట్లాడుతారు." ఎవరో చెప్పారు కాదు; అరిచారు మైక్ లో, మూడామడ్ల కవినిపించేలా.

"లేడీస్ అండ్ జంటిల్ మన్!" పూలమాలలు ప్రక్కకు పెట్టి ప్రసంగిస్తున్నారు శంకరంగారు. బహుశాంతంగా వుంది ఆయన కంఠం. అంతవరకు

పూల మాలలో మునిగిన వ్యక్తి వాళ్ల శంకరం మామయ్యేనని గుర్తించని ప్రసన్న తెలిసి ప్రాన్పడి పోయాడు. మరి కొంత సేపటికి తేరుకొని తిన్నగా ఇంటిదారి పట్టాడు. 'మారి పోయిన మామయ్యను చూశానని అమ్మకుచెప్పాలి' అనుకుంటూ.

ప్రసన్న వాళ్ల ఇంటి ముందు ఆగున్న కారును చూసి కొంచెం సందిగ్ధంలో పడ్డాడు. 'ఎవరు చెప్మా!' అను కుంటూ లోపలకు పోబోతుండగా, గుమ్మందాటిన ప్రసన్న గుండెలు గుబేలు మన్నాయి.

గుమ్మాని కెదురుగ్గా కుర్చీలో కూర్చొనుంది, తొలియవ్వనంలో వున్న వో తరుణి! పదిహేడేళ్ల ప్రాయంలో వుంది, పలుచగా కేశాల్ని నొసటిపై కొదిలి పాపిడిలేకుండా పైకి దువ్విన శిరోజాలు, అలంకరించు కొన్న తీరు చూస్తుంటే ఎవరో హిందీ తారను జ్ఞప్తికి తెస్తుంది!! ఎర్రని విశాలమయిన నొసటి మీద, ముంగురుల మధ్యనుండే, నల్లటిరంగు తిలకం ఇట్టే అగుపిస్తుంది!..... ముచ్చటయిన ఆమెడలో తెల్లటి పూసలదండ అందమయిన ఆ వక్షంమీద అల్లనల్లన నర్తిస్తుంది. జిగేల్‌మంటున్న జార్జెట్ చీర జారిపోతుం దేమో నన్నట్టుంది. జారుతున్న జిలుగు పైటను సదరుకో లేక సత మత మవు తుంది. తెల్లని రవిక గుండా బ్రాస్ రేడియంలా అగుపిస్తున్నాయి. అబ్బ!...... అందానికి అందంగావున్న అలాంటి అమ్మాయి ప్రసన్నకు తారస పడడం అదే ప్రథమం గాని, 'అంత అందాన్ని కళ్లారా చూశాడా?' అన్నదే అపనమ్మకం.

వెనక్కి మళ్లటానికి మన సొప్పక ముందుకు పోవడానికి ధైర్యంచాలక, అక్కడే నిలుచుండి పోయాడు తల దించుకుని ప్రసన్న.

"హల్లో ప్రసన్నా! హౌ ఆర్ యూ?"

పాలనురగలాంటి ఆ పడతి పలుకు లకు పిచ్చెక్కి పోయింది ప్రసన్నకు. గిరు క్కున వెనక్కి తిరిగాడు గుండెలు బిగబట్టి.

"ప్రసూ!" తాయారమ్మ పిలుపుకు ఇటుగా తిరిగాడు ప్రసన్న. అంతవరకు ఆ అమ్మాయి ప్రక్కన తాయారమ్మ, కమల వున్నట్టే తెలీలేదు ప్రసన్నకు. "గుమ్మం దగ్గరే ఆగావేం?.... గుర్తించలా?..... మన పారురా!... ఇప్పుడే వచ్చింది." తల్లి మొఖంలో ఏదో క్రొత్త కళ ద్యోతక మయింది ప్రసన్నకు.

"పార్వతా?" తలఎత్తి ఆ మూర్తి కేసి వోసారి చూసి తలదించుకొని తల్లి ప్రక్కకెళ్లి నిలుచున్నాడు ప్రసన్న, 'అత్తయ్య రాలేదా పార్వతీ?" తల దించుకొనే అడిగాడు తిరిగి.

"అదేరా ప్రసూ!.... నేనూ అడుగు తూంటే!" తాయారమ్మ ప్రసన్నకు చెప్పుతూండగానే పార్వతి అందుకుని, "ఉదయం సముద్రస్నానానికి వెళ్లి అలసి పోయారు మమ్మీ. అందుకనే నేనొక్కర్తినీ ఇలా రావల సొచ్చింది" అంటూ ప్రసన్న కేసి పరీక్షగా చూసింది. అతని అమా యకతకు లోలోన నవ్వుకుంది.

తాయారమ్మ, కమల, ప్రసన్న ముగ్గురూ మవునంగానే వింటున్నారు.

"అత్తయ్యా!" పార్వతి మెడలో పూసల మాలను కుడిచేతి చూపుడ్రవేలితో త్రిప్పుతూ, "ప్రసన్న నింత పిచ్చివాడిగా పెంచావేం?.... ఇంటిలోనే ఇంతబిడియంగా వుంటే ఇక బయటకుపోతే ఏంచేసా డు?" అంది.

కొడుకును 'బావా!' అని పిలిచే పార్వతి, ఇప్పుడు 'ప్రసన్న!' అని సంబో ధిస్తుంటే వినలేక విస్తుపోయింది ఆ పిలుపుకు తాయారమ్మ.


"కమలా! ఇప్పుడు నువ్వేం చేస్తున్నావు?" పార్వతి ప్రశ్నించింది మవునంగా వున్న ఆముగ్గురి మొఖాలకేసి మార్చి మార్చి చూస్తూ— కమలను

కమల కళ్లింతచేస్తూ, "సెకండరీ ట్రెయినింగ్ చదువు తున్నాను. సెకం డియరిది" అంది, మావూను నీకెందు కన్నట్టు ముక్తసరిగా.

"డామిట్!.... సెకండియరయి పోగానే స్కూళ్లల్లో కెళ్లి 'అ, ఆ' లు నేర్పు తావా! డర్టీ కీచర్!!" ఆవేశంగా అంది పార్వతి ఆవిడ సొమ్మేదో ఒరిగి పోతున్నట్టు.

ప్రసన్న విషయం కూడా అడిగి తెలుసు కుంది. "ప్రసన్నా! మీ కాలేజీలో కూడా ఇలా బిడియంగానే మసలుతావా?..... అసలు నీకు నామకా వోగరల్ ఫ్రెండయినా వుందీ?.... ఆ .... ఎలా వుంటారులే. నీకు మరదల్ని చూట్టానికే సిగ్గాయె! పైగా వరాయి పిల్లలతో, అందునా కాలేజీ పిల్లలతో స్నేహమంటే, కడలి నీదడమే నన్నట్టుంటుంది— నీకైతే!" మళ్లీ తాయారమ్మ కేసి చూస్తూ ఇలా అంది "నాకొక అనుమానం అత్తయ్యా!.... ప్రసన్న ఇలా బిడియంగానే పెరుగుతూంటే— కాదు, నీవు పెంచుతూంటే, పెళ్ళిలో కాబోయే పెళ్లానికి కట్టవలసిన తాళి ప్రక్కనే వున్న పురోహితుడి మెళ్లో కడతాడేమోనని......" ఏదో అర్థోక్తిలో ఆ పింది, మురిపెంగా నవ్వుతూ పార్వతి! టూత్ పేస్టు ఎడ్వర్టయిజు మెంట్‌లో అందమయిన అమ్మాయి పలువరస ప్రకాశిస్తున్నాయి— పార్వతి పళ్ళు!! ఆ గదిలో వ్యాపిస్తున్న గాలంతటిలో కలిసి పోయి మత్తెక్కిస్తుంది, ఆమె బట్టల గుండావస్తున్న ఖరీదయిన సెంట్ వాసన!!!

మిగిలిన ముగ్గురికీ కొంచెం ఇష్టం కలిగించినా, పార్వతి తృప్తికన్నా పై మాటలకు నవ్వకుండ వుండలేకపోయారు.



పార్వతి చేతికున్న బుల్లివాచ్‌లో ముళ్ళు చూసుకొని, వెళ్దామంటూ లేచింది.

పార్వతితో పాటు తాయారమ్మ, కమల, ప్రసన్న, కారు దగ్గర కొచ్చారు.

పార్వతి చుట్టూ కలియ జూస్తూ, "అత్తయ్యా! ఇది వరలో ఇదంతా పర్ర లాగుండేది. ఇప్పుడు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చా ఏం, బుల్లి బుల్లి డాబా లిన్నిన్ని. ఛ్ఛ .... ఒక్క దానికీ షేపుం డదు" అంటూ కారులోకెక్కి కూర్చుంది. డోర్ తెరచి డ్రైవర్ కూడా ఎక్కాడు

కారు కదిలింది—

ముగ్గురికేసి చూస్తూ ముచ్చటగా నవ్వింది పార్వతి. నిలుచున్న ముగ్గురూ నిశ్చేష్ట ముగ్దుల్లా నిలుచున్నారు, కళ్ళా ర్పకుండా కారు, క్రిందనున్న దుమ్ము పార్వతి కేసి చూస్తున్న ముగ్గురి మొఖాల మీదా కురిపించి, ముందుకు దూసుకు పోయింది.

అప్పటిగ్గాని రెప్పవేయలేదు - ఆ ఆరు కళ్ళూ!!!

మానుతున్న గాయం మళ్ళీరేగింది

బంగాళాఖాతంలో వాయుగుండం బహు వేగంగా ప్రయాణిస్తున్నట్టు, తాయా రమ్మ ఎదలో తీరని తృష్ణ పురకలు వేస్తుంది.

ఎట్టకేలకు రానే వచ్చింది—

తుఫాను!

తాయారమ్మ ఎదలో!!

తాయారమ్మ మంచం పట్టింది. తారు మారయ్యాయి పరిస్థితులు.

కమల సెకండరీ సెకండియర్ ముగి సింది. పేపరులో తన నంబరు చూసి మురిసింది. కమల మీద వున్న మక్కువ కొద్దీ, అదే స్కూల్లో ఎపాయింట్ చేశారు హెడ్మిస్ట్రస్.

ప్రసన్న పరీక్షలయి పోయాయి. ఫస్ట్ క్లాస్ రాకున్నా 'పాస్' అని పించు కున్నాడు. అన్ని ఆఫీసులకు ఎప్లయి చేస్తూ సింగరేణి కాలరీస్‌కు కూడా ఒక అప్లికేషన్ పంపాడు. అదృష్టం కలిసొచ్చి క్రొత్తగూడెం హెడ్డాఫీసులోన వో గుమస్తా గిరి దొరికింది.

క్రొత్త ప్రదేశం, భోజనానికి బాధ పడతావన్నా కాదూ కూడదని తల్లిని ఒప్పించి ఈ వూరు చేరాడు ప్రసన్న.

* * *

పొంగిన నీళ్ళలో చెంచాడు 'నెస్‌కేఫ్' కాఫీ పొడరు వేసి కలిపాడు ప్రసన్న.

# వింతభ్రాంతి

స్టౌ ఆఫ్ చేసి కాఫీ త్రాగాడు!!

తలుపుకు తాళంవేసి బయటకు వచ్చాడు!!!

అలసి పోయిన భానుడు పశ్చిమానికి పరుగు లిడు తున్నాడు. ఆ క్షణంకోసం పొంచి కూర్చున్న కలువ ప్రియుడు వేడెక్కిన యీ ప్రకృతికి వెన్నెల నంది స్తున్నాడు వెన్నెల చల్లదనానికి ప్రకృతి ప్రియురాలు పరదా తొలగిస్తుంది.

హోటల్ భోజనం ముగించి క్వార్టర్‌కు వస్తున్నాడు ప్రసన్న.

'స్పెషల్' బస్సులో 'భద్రాచలం' పోతున్న భక్తులు 'దేవుడి దర్శనాని కింకెంత దూరం?' అన్నట్టు చూస్తు న్నారు, దూరాన అగుపిస్తున్న దీపాలకేసి. స్టేషన్‌లో టిక్కెట్టు కోసం రైలాట ఆడుతున్న ఆసామి, 'కవుంటర్ దర్శ నాని కింకెంత దూరం?' అన్నట్టు ముం దున్న ప్రయాణీకుల 'క్యూ' కేసి చూస్తు న్నాడు చర్చిపైన శిలువ సరుసి మూర్తి త్వానికి ముద్రగా నవ్వుతుంది. క్రొత్తగా కడుతున్న వాటర్‌టాంకు దగ్గర రాత్రిళ్ళు కూడా పనిచేయిస్తున్నారు లంబాడీ లేబర్‌తో కంట్రాక్టర్లు. పోలీస్ స్టేషన్‌లో నిజం చెప్పని దొంగను మధ్య నిలుచుండ బెట్టి, చుట్టూ నిలుచున్న పోలీసులు చిత్తుకింద తంతున్నారు. దెబ్బలకు తాళలేక దొంగ అరుస్తున్న అరుపులకు బాబూ క్యాంప్‌లో జనం బెంబేలయి పోతున్నారు!!..... దూరాన కొండల మీద అద్దంతరంగా రేగిన అగ్గికి అడవంతా ఆహుతయి పోతుంది— ఆమంట లిక్కడి కగపిస్తున్నయి!!..... శ్మశాన వాటికలో శవాల్ని కాల్చుతున్నట్టు సున్నపుబట్టీలు రగులుకుంటున్నయి—పొ గ లు గ్రక్కుతూ. ... 'మావ్‌లాంటి కవిగనక ఈ పొగల కేసి వోసారి చూస్తే ఎలాంటి కవిత వ్రాసేవాడో?...... నిజం!.... వో కళా ఖండాన్నే సృష్టించి తీరేవాడు. అవును! కాలిపోతున్న ఇళ్ళ పొగలకేసి చూస్తూ కవిత వ్రాస్తా' నని మామ్మేగా ఉన్నాడు. ఆ పైకెగబ్రాకుతున్న పొగల అందాన్ని ఎందుకూ పనికిరాని వాళ్ళు ఎన్నిసార్లు చూస్తే ఏం?.... శుద్ధ వేస్ట్.... !!'

మావ్ కవితను గూర్చి ఆలోచిస్తూ నడుస్తున్న ప్రసన్న క్వార్టర్‌కు చేరే సరికి, చేతికున్న స్క్వేర్ వాచ్‌లో ముళ్ళు రెండూ తొమ్మిది మీద కలిశాయి.

గుమ్మం ముందు ఆగి జేబులు తడువు కున్నాడు ప్రసన్న! ఖాళీగా వున్న జేబులలో చేతులుంచి జేబుగుడ్డను బయటకు లాగి మరీ చూసుకున్నాడు— చాకిరేవులో ఇసకరాలిందే గాని తాళాం చేతులు మాత్రం అగుపళ్ళేదు.

దారితప్పిన బాటసారిలా బిత్తరపో యాడు ప్రసన్న. ప్రక్కనున్న లోక నాథంగారి క్వార్టర్ కేసి చూశాడు. 'బిత్తర పోతావు దేనికే వో పిల్లా.....!' తెలుగు పాటలు వినుపిస్తున్నయి, వాళ్ళ రేడియోలో నుండే చిన్నగా.

వాళ్ళ తాళాలేవయినా సరిపోతవేమో చూద్దాం! అనుకుంటూ.... వెళ్దామా? వద్దా?..... అనే సందిగ్దంలో పడ్డాడు ప్రసన్న.

లోకనాథంగారు తప్పించి ఆ ఇంట్లో మరే పురుగూ పరిచయం లేదాయె. తీరా పోయి పిలిచాక ఆయన కాస్తా ఇంట్లో లేకుంటే?...... 'కనీసం వాళ్ళ నుగ పిల్లలతోనన్నా మాట్లాడుతూవుండు' తాయారమ్మ వ్రాసిన మాటలు రేడియంలా వెలిగాయి అతని మస్తిష్కంలో. ప్రసన్న మనస్సు పరి పరి విధాలా పోయింది.

అప్రయత్నంగా అతని కాళ్ళు లోక నాథంగారి లోగిలికేసి దారి తీసాయి—

తెలుగు పాటలనేమో సౌండ్ కాస్త పెంచారు.

గేటు ముందు ఆగిన ప్రసన్నకు చంద్రకాంతం పూలవాసన గుప్పున కొట్టింది.

పూలమొక్కలున్న ఇల్లూ, ఆడపిల్ల లున్న ఇల్లూ ఆకర్షణంగా వుంటా యట......?? పై రెండూ ఒకే చోట తారస పడితే వేరే చెప్పాలా......???

నుదుటిపై చమటను అరిచేతితో తుడుచుకొంటూ, 'సార్!' సాధ్యమయి నంతవరకూ సభ్యతగానే పిలిసాడు. ఎదురు చూస్తూ నిలుచున్నాడు— ఎవరూ రాలేదు బయటకు—

పవర్ హౌస్ సైరన్ తొమ్మిదయిం దంటూ గోలచేస్తుంది!

మళ్ళీ పిలిచాడు— ప్రసన్న!

షరేం లాభంలేక పోయింది.

గేటుతడుతూ పిలిచాడు ధైర్యంగా—

అప్పటికి వినిపించిందిగామోసు వురు కుతూ వచ్చింది గేటు దగ్గరకు— వాళ్ళ బొచ్చు కుక్క!

వచ్చిందే లగాయితు; ఎవడో వీపున మోదు తున్నట్టు మొరగడం మొదలు పెట్టింది.

'వెధవ కుక్క! ఎప్పుడూ అరవగా నయినా వినలేదు. ఈ రోజేం దాపురిం చిందో దీనికి?' విసుక్కుపోయి వెనక్కు మళ్ళ బోతున్న ప్రసన్న, "ఎవరండీ?" అన్న పిలుపువిని అటుగా చూశాడు గేటుదరికి వస్తున్న మనిషిని.

అనుకున్నంత పనీ అయింది. ప్రసన్న ప్రాణాలు పైకే పోయాయి! లోకనాధం గారి పెద్దమ్మాయి— కృష్ణవేణి!..... "మీరా?" ఎన్నాళ్ల బట్టో పరిచయ మున్న వ్యక్తిని పలుకరించినట్టు పలుక రించింది గేటు కొక్కెం తీస్తూ, "నాన్న గారు భోంచేస్తున్నారు, లోపలకు రండి" కృష్ణవేణి ననుసరిస్తూ లోపలకు వెళ్లాడు ప్రసన్న.

"కూర్చోండి!" కేన్ కుర్చీ చూపిం చింది కృష్ణవేణి. చేసేదిలేక కూర్చు న్నాడు ప్రసన్న— గోడలకు తగిలించిన ఫోటోలకేసి చూస్తూ.

'టామీ' గామోసు ఆ బొచ్చు కుక్క ప్రసన్న కుడికాలికి చేరువగా చేరి కాస్త నాలికతో నాకేసరికి దిగ్గున లేచి నిలు చున్నాడు. ఫక్కున నవ్వింది కృష్ణవేణి, "ఏం ఫరవాలేదు లెండి! పెంపుడు కుక్క కదూ, పొరుగింటారే గదా అని మీ ప్రక్కకు చేరింది— అంతే!!"

కృష్ణవేణి మాటలు పరీక్షగా వింటు న్నాడు ప్రసన్న.

బొచ్చు కుక్క పోయి కృష్ణవేణి కాళ్లదగ్గరకెళ్లి కూర్చుంటూ 'ఎవరీ పెరికి వెధవ?' అన్నట్టు చూస్తోంది, బొచ్చులో దాగిన బుల్లి కళ్లతో. కృష్ణ వేణి కళ్ళు రెండూ 'దోవతప్పివచ్చారా?' అన్నట్టు చూస్తున్నాయి, ప్రసన్న కేసి. బొచ్చు కుక్క నాకిపోయిన కాలికేసి చూసుకుంటున్నాయి ప్రసన్న రెండుకళ్ళూ!!

"ఏం బాబూ నిలుచొనే వున్నావేం.....? కూర్చో!"

ఆ ఆరు కళ్ళూ అటుగాతిరిగాయి—

సీది తువ్వాలుతో మూతి తుడుచు కుంటూ లోకనాధంగారు వచ్చారు. ఆయన వెనుకనే సతీమణి రాజమ్మగారు, రెండవ అమ్మాయి రోజారాణి వచ్చారు.

ప్రసన్నను వాళ్లకు పరిచయం చేశారు లోకనాధం గారు.

"హోటల్‌కు భోజనానికి పోతే తాళాం చేతులు ఎక్కడో జారిపోయాయి సార్. మీవేవయినా పట్టొచ్చేమో చూద్దామని...." పరిచయ వాక్యాలు పూర్తికాకముందే వచ్చిన పని తేల్చి చెప్పాడు ప్రసన్న.

"అర్రె! అన్నయ్య వాళ్లన్నారేరే సమయానికి" అంది కృష్ణవేణి సాలో చనగా.

"ఏం?...... మీ అన్నయ్యలుంటే అట్ల తెడ్డుతో తీసే వాళ్లేం" అందామను కున్నాడు ప్రసన్న. అంత ధైర్యంలేక అలా నవ్వి వూరుకున్నాడు. కృష్ణవేణి దగ్గరనుండే రోజారాణి దగ్గరకురికింది తోకాడిస్తూ బొచ్చుకుక్క. రోజారాణి దానిని రెండు చేతులతో పైకెత్తి, రొమ్ముల కానించుకొంది.

'ఏవిటి..... కుంజ పోగొట్టుకొన్నావా? ఆడ కుంజనా లేక మగ కుంజ?'' ఆత్ర తగా అన్నారు లోకనాధంగారు.

కాస్త సందిగ్ధంలో పడ్డాడు ప్రసన్న. నీళ్లు నములుతూనే అన్నాడు, "నాకా కుంజల్లో రకాలు తెలియవు గాని అది మాత్రం 'క్లిక్' కుంజ" అని.

రాజమ్మగారు ప్రక్క గదిలో కెళ్లి వో తాళాల గుత్తి తెచ్చి ప్రసన్న కిచ్చింది. "వీటిలో ఏదేనా చాలుతుందేమో చూడు బాబూ!" అంటూ.

ప్రసన్న అవి పుచ్చుకు ముందుకు పోబోయి "కాస్త ఆగండి!" అన్న పిలుపు విని ఇటుగా తిరిగాడు. కృష్ణవేణి రేడియో బల్లవద్దనున్న టార్చితెచ్చి ప్రసన్న కిస్తూ, "చీకట్లో ఏం చూస్తారు. ఈ టార్చికూడా తీసుకెళ్లండి!" అంది.

టార్చి తీసకుంటున్న ప్రసన్నకు కృష్ణవేణి వేళ్లు తాకేసరికి ఏదో తెలియని అనుభూతి కలిగింది. అర క్షణం ఆమెకేసి చూసి ముందుకు నడిచాడు.

ప్రసన్న జీవిత పుటల్లో ప్రథమ ప్రకరణం ముగిసింది!

ఏనాడూ పరాయి ఆడ పిల్లలతో పరిచయం లేని ప్రసన్నకు, ఈ నాటికి పరిచయమ్ములంటూ లభించారు.

ద్వితీయ ప్రకరణలో పడ్డాడు ప్రసన్న!!

'అందరకూ లభించదు ఆమెని తాకేంత అదృష్టం' ప్రేమలో పడి పోయాడు ప్రసన్న— పాపం పసివాడు!!!

అలా ఇలా చేసి గుత్తిలోవున్న మొత్తం తాళాలు పెట్టి చూశాడు ప్చ్.... లాభం లేక పోయింది. చివరకు విసుగు చెంది తాళాం కప్పను పొందికగా పట్టి, ఒక్క గంజు గుంజాడు విసురుగా—

విడిపోయింది బంధం!

వచ్చేసింది తాళం!!

తిరిగి లోకనాధం గారింటికి వెళ్లాడు. టార్చి తాళాల గుత్తి బల్లపై నుంచి 'థాంక్స్' చెప్పాడు. ఎదురుగా లోక నాధంగారు చూపించిన కుర్చీలో కూర్చు న్నాడు. రాజమ్మగారు, కూతుళ్ళూ ప్రక్క గదిలోకి వెళ్లినట్టున్నారు. ఒక్కరే కూర్చొని ఆలోచిస్తున్నారు, భరిణలో వక్కపొడి నములుతూ, "ఆ .... మీ స్వగ్రామం బందరన్నావు గదూ!" వక్కపొడి

(42 వ పేజీ చూడండి)



భరిణను ప్రసన్న కిస్తూ, "అక్కడ త్రివేణి వక్కపొడి బాగుంటుంది. మే మొక సారి నీ పూర్వోచ్చామువులే, మావరిది పెళ్ళికి."

ఎదురింటి ఆడ పిల్లల వూసే ఎరుగని ప్రసన్నకు అంగడిలో అమ్మే ఆ వక్కపొడి వూసేమెరుక. 'అలవాటు లేదండా' మను కుంటుండగానే ప్రక్క గదిలో నుండీ ప్రవేశించారు రాజమ్మగారు. ఆమె వెనుకగా చిన్నగా నవ్వుకుంటూ కృష్ణవేణి, రోజారాణీ. వాళ్ళవెనుకగా షరా మామూలే— బొచ్చుకుక్క!

"కుంజ కుదిరిందాబూబా?" వూల గ్లాసులో పాయసం తెచ్చి ప్రసన్నకిస్తూ అడిగారు, రాజమ్మగారు.

వూసలగ్లాసులో పాయసం పూర్తి చేస్తూ, "కుదిరిందండీ, కుంజగుత్తి, టార్చి, ఆ బల్లపై నుంచాను. మీక్కొంచెం శ్రమ గల్గించా నను కుంటూను?" కొంచెం బిడియంగానే పలికాడు ప్రసన్న. ఖాళీ గ్లాసు రాజమ్మగారి కిస్తూ.

"దాని దేముందిలే బాబూ! ఇరుగూ పొరుగూ అన్నాక ఇలాంటి సహాయాలు చేసుకోకుంటే సాగేదెలా?"

'అవును మరి' అన్నట్టుగా చూస్తుంది ప్రసన్నకేసి కృష్ణవేణి.... లంగా అంచును నోటితో కరచి లాగుతుంది రోజారాణిని వాళ్ళ బొచ్చు కుక్క—టామీ

ప్రసన్న వాళ్ళ దగ్గర నుండి సెలవు తీసుకొని తన క్వార్టర్‌కు చేరాడు. నిద్ర వచ్చేవరకూ ప్రేమించడం చేతగాని

# మితభాషి

(19వ పేజీ తరువాయి)

వాళ్ళకు అంకిత మిచ్చిన ఒక రచయిత నవలేదో చదువుతూ, నిద్రా దేవిలో ఒరిగి పోయాడు.

ప్రసన్నకు మెలకువ వచ్చేసరికి లోకనాథంగారి రేడియాలోనుండీ వినిపిస్తుంది స్వర్గీయ సైగల్ పాట "సొహేకో రాడవ చాహి....." అంటూ.

తలుపు తెరిచి బయటకు చూసాడు ప్రసన్న!

బళ్ళకు పోతున్నారు బడి పిల్లలు. ప్రసన్న కెందుకో ముచ్చటను పించింది వాళ్ళ యూనిఫామ్ చూస్తుంటే. అప్పుడే వెళ్తున్నారు కృష్ణవేణి, రోజారాణి. తెల్లని రవికమీద పచ్చని పరికిణీ అదే రంగులో లంగా వేసింది కృష్ణవేణి. మొయ్యలేనన్ని పుస్తకాల్ని పొందికగా హృదయానికి అదిమి పట్టు కొంటూ, జారుతున్న పైటను సదురుకుంటూ నడుస్తుంది. ఎందుకోమరి— విషాద చిహ్నంగా నల్లని రంగు రిబ్బనులు వేసింది. రోజారాణి కూడా అలాంటి రిబ్బనులే వేసింది. తెల్ల రవికమీద పచ్చలంగా— షరా మామూలే!!

మిగిలిన పిల్లలుకూడా అదేకోవలో ఉన్నారు "ఇదేగావోసు వీళ్ల యూనిఫామ్! రిబ్బన్లకు కూడా నిర్దుష్టమైన రంగును నిర్ణయించినవాళ్ళు, చేతి గాజుల కెందుకు నిర్ణయించలేదో?" అనుకున్నాడు— పంచ రంగులో వున్న వాళ్ళచేతి గాజులకేసిచూస్తూ:

అలా ఆలోచిస్తూ నిలుచున్న ప్రసన్నను బళ్ళకు పోతున్న పిల్లలు ఇటుగా చూస్తున్నారనీ, అందునా కృష్ణవేణి, రోజారాణి తననుచూసి నవ్వుకుంటూ పోతున్నారనీ గమనించనేలేదు.

ఎందుకనో మితభాషిగావుండే ప్రసన్నకు కలుపుగోలుగావుండే కృష్ణవేణి ప్రతిక్షణం కళ్ళల్లో మెదులుతుంది. వీణ తీగెలు మ్రోగినట్టూ, హృదయ తంత్రులు మీటినట్టూ "మీరా?" అంటూ పిలిచిన ఆ పిలుపే మళ్లీ మళ్లీ వినాలనుపిస్తుంది. 'మంచిపిల్ల' అనుకున్నాడు మనస్సులో నిష్కల్మషంగా.


ఉంగరాలజుత్తు ఒత్తుకొంటూ వంచిన తల ఎత్తకుండాపోయే ప్రసన్నను చూసి రోజా, రాజమ్మగారు మురిసిపోయేది. రోజల్లా ప్రసన్న విషయమే ప్రస్తావిస్తుండేది. "ప్రసన్నను గురించి మీ ఉద్దేశం?" రాజమ్మగారిప్రశ్నకు లోలోన నవ్వుకునే వారు లోకనాథంగారు.

"బుద్ధిమంతుడు. పైగా, బాగుంటాడు. విద్య, వినయం, ఒకింత బిడియం అన్నీ నమపాళ్లలో రంగరించిపోశారు అతనిలో వాళ్ళ తల్లిదండ్రులు!!" ప్రసన్నమీద వున్న గౌరవం ఒక్కసారి కట్టలు త్రెంచుకొని ప్రవహించింది లోకనాథంగారి పెదాల మీదుగా.

ప్రసన్నను అడిగి వాళ్ళ తల్లి చిరునామా తెలుసుకొని తాయారమ్మకు వో ఉత్తరం వ్రాశారు, రాజమ్మ లోకనాథంగారు— ప్రసన్న కళ్యాణ విషయం—వాళ్లమ్మాయి హెచ్. ఎస్సీ చదువుతుందనీ—పేరు కృష్ణవేణనీ—పదహారేళ్లనీ—ప్రసన్నకు ఈడనీ....

మంచి కుర్రాడనీ! మంచి కుటుంబమనీ! కంపెనీలోనే ఉద్యోగం కావడం మూలంగా లోకనాథంగారికి ప్రసన్నపై వో పడి గౌరవం పెరిగింది.

దినదినానికి ప్రసన్నపై పెరుగుతన్న గౌరవం పరోక్షంగా ఉంచలేకపోయాడు లోకనాథంగారు. మొదట్లో కాదూ కూడదన్నా హోటల్ మానిపించి వాళ్లింటిలోనే భోజనం ఏర్పాటు చేశారు. భోజనం వడ్డించి ఎదురుగ్గా కూర్చున్న రాజమ్మగారినిచూస్తే వాళ్లమ్మతాయారమ్మ జ్ఞప్తికి



వచ్చి, ఒక్కనిట్టూర్పు విడిచేవాడు ప్రసన్న. లోకనాథంగారి కుటుంబం తనపై చూపిస్తున్న ఆప్యాయతకు ప్రసన్న లోలోన ఎంతో కృతజ్ఞత తెలుపుకొనేవాడు. ఒక్కోసారి అవధులుదాటుతున్న వాళ్ల అనురాగానికి అసలు కారణం తెలియక విస్తుపోయేవాడు.

రోజారాణి తన్నుచూసి ఏదో చిలిపిగా నవ్వుతుంటే చిత్తయిపోయేవాడు. కృష్ణవేణి తనను క్రీగంట చూస్తుంటే ప్రసన్న హృదయంలో జయగంటలు మ్రోగేయి!!! ఆ జయ గంటల సవ్వడి ప్రతినిత్యం అతని మస్తిష్కంలో ఏదో తెలియని అలజడిని రేపేది. రానురాను ఆ అలజడే వో అనుభూతిగా మారింది???

ఆరోజు ఆఫీసునుండే రాంగానేపోస్టులో వచ్చిన కవరుచించి, చదవసాగాడు ప్రసన్న. తల్లిచేతివ్రాతను గుర్తించి మరీ తొందరగా చదవసాగాడు.....

"ప్రసూ!

మితభాషివి. నీకు నీవుగా ఏ విషయంలోనూ ముందడుగు వేయలేవని నాకు బాగా తెలుసు. తెలిసికూడా నిన్నలా పెంచడం పొరబాటేనేమో.....

ఇంతవరకూ ఒంటరిగా ఉంటున్నావని నీ విషయంలోనే ఎక్కువ ఇదయిపోయే దాన్నిగాని, లోకనాథంగారి ఉత్తరం చదివి ఎంతగానో సంబరపడిపోయాను. వాళ్లపెద్దమ్మాయి కృష్ణవేణిని నీ కివ్వాలనుందంటూ వ్రాశారు. నీకూ సమ్మతమంతే, త్వరలోనే తాంబూలాలు తీసుకుందాం.

ఒక్క విషయం.....

సంసారం అనేది వో సాగరం అంటారు. సాగరం నడుమ ఎంత ప్రశాంతంగా అగుపించినా అడుక్కుపోతున్నకొద్దీ అతీ,గతీఉండదు. ఆణిముత్యాలకయినా, క్రూరమత్స్యాలకయినా, ఆ అంధకారమే ఆలవాలం! అంధకారమే సాగరస్వర్గం! గాని, సంసారస్వర్గం అంతకంటే అంధకారంగానూ, అగమ్యగోచరంగానూ అగుపిస్తుంది. ఆ అంధకారంగుండానే కాంతి కిరణాన్ని చొప్పించాలి. ఆ కాంతికిరణంగుండానే సంసారపు సుఖాన్నీ అందుండే స్వర్గాన్నీ చవిచూడాలి— సంసారాన్ని సస్యశ్యామలం చేసుకోవాలి. అలాంటి ఘడియకోసం అనుక్షణం నిరీక్షించు.

నీ జాబుకొరకై ఎదురుచూస్తున్న,

నీ, తల్లి."

ఆ ఉత్తరం అలానే హృదయానికిహత్తుకున్నాడు!

ఆ తల్లి ప్రేమతో వ్రాసిన ఆ లేఖ ఆ తనయుని హృదయంలో కలసిపోయింది. కాదు, కరగిపోయింది—

ప్రసన్న జీవితంలో రెండవ ప్రకరణం కూడా ముగియబోతోంది!! .....మూడుముళ్లేయడం తరువాయి, మూడవ ప్రకరణం మొదలవుతుంది!!! ●




కే. టి. కృష్ణమూర్తి ఆచారిగారి

"మేల్ మాయిల్ మందు"

నల్లరంగు, యెర్రరంగు పొడలు, దద్దులు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందువ ఏర్పడు వినుగుపుట్టించు రణములు మొదలగు

*దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి*

—— వివరములకు ——

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P. O.) N. A. Dt.



హమామ్ వల్ల తాజాగాను కాంతిగాను వుండండి




వాడకములో చాలా రోజులు వచ్చే టాయిలెట్ సబ్బు

హమామ్‌తో రుద్దుకొని ప్రతి దినము స్నానము చెయ్యండి. హమామ్ మీ శరీరమును శుభ్రపరచుటయే గాక, దానికి కాంతినిచ్చి, హాయిని గొల్పును. ప్రతిరోజూ హమామ్ వాడండి...ఈ సబ్బు మాత్రమే వాడటానికి చాలా రోజులువస్తుంది.

టాటా ఉత్పత్తి

CMTH-311